వందరోజుల్లో సందడి షురూ

రామ్

'ఇస్మార్ట్ శంకర్'గా రామ్‌తో పూరీజగన్నాథ్ చేయించిన హంగామా అంతాఇంతాకాదు. ఆ కేరక్టరైజేషన్‌కే యువతరం ఫిదా అయిపోయారు. అందుకే.. ఇప్పుడు ఆ డోసును డబుల్ చేస్తూ.. 'డబుల్ ఇస్మార్ట్'గా మరోసారి ప్రేక్షకుల ముందుకొస్తున్నారు రామ్, పూరీజగన్నాథ్. పూరీ కనెక్ట్స్ బేనర్‌పై చార్మీకౌర్‌తో కలిసి పూరీ జగన్నాథ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం ముంబాయ్‌లో జరుగుతున్నది. బాలీవుడ్ స్టార్ సంజయ్‌దత్ ఇందులో ప్రత్యేక పాత్ర పోషిస్తుండటం విశేషం. వచ్చే ఏడాది మహాశివరాత్రి కానుకగా మార్చి 8న సినిమా విడుదల కానుంది. అంటే ఇంకా వందరోజులు సమయం ఉందన్నమాట. ఈ సందర్భంగా కౌంట్ డౌన్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. సినిమాలో మనం చూడబోతున్న యాక్షన్ వైబ్‌ని ఈ పోస్టర్ ఆవిష్కరించిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సాంకేతికంగా అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలోని ఇతర నటీనటుల వివరాలను త్వరలో ప్రకటిస్తామని మేకర్స్ అన్నారు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడం, మలయాళ భాషల్లో భారీగా విడుదల కానున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి సంగీతం: మణిశర్మ.

ఆవకాయ.. ఆంజనేయ..

తేజ సజ్జా, ప్రశాంత్ వర్మ

'ఆపద వస్తే ఆంజనేయస్వామి.. ఆకలేస్తే ఆవకాయ.. ఇది మన కల్చర్‌లో బలంగా నాటుకుపోయింది.. ఇదొక ఎమోషన్. అలాంటి కల్చర్‌ని కమర్షియల్ వేలో అద్భుతంగా చూపించాడు ప్రశాంత్. దీనికి గ్రేట్ ట్యూన్ ఇచ్చిన అనుదీప్‌కీ, మంచి సాహిత్యం అందించిన సింహాకీ, అద్భుతంగా పాడిన సాహితికి, ఇతర భాషల్లో పాడిన సింగర్స్‌కి థ్యాంక్స్ చెప్పకుంటున్నాను. అద్భుతమైన ఆలోచనని అంతే అద్భుతంగా విజువలైజ్ చేసిన ప్రశాంత్‌కి ధన్యవాదాలు. వచ్చే సంక్రాంతి 'హను-మాన్'తో థియేటర్లలో పండగ చేసుకుందాం' అని యువహీరో తేజా సజ్జ అన్నారు. ఆయన కథానాయకుడిగా ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'హను-మాన్'. కె.నిరంజన్‌రెడ్డి నిర్మాత. ఈ చిత్రం సంక్రాంతికి విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాకు చెందిన 'ఆవకాయ ఆంజనేయ..' పాటను బుధవారం మేకర్స్ విడుదల చేశారు. 'ఈ సినిమాలో 'ఆవకాయ.. ఆంజనేయ' పాట చాలా ప్రత్యేకం. టీజర్‌తో సినిమాపై చాలా మంచి హైప్ వచ్చింది. సినిమా నేపథ్యంపై చాలామందికి చాలా అనుమానాలున్నాయి. అన్నింటినీ రానున్న ప్రమోషన్ మెటీరియల్స్ ద్వారా చెప్పడానికి ప్రయత్నిస్తాం. చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్లదాకా అందరూ చూడదగ్గ సినిమా ఇది. సాంకేతికంగా అబ్బురపరిచేలా ఉంటుందీ సినిమా' అని దర్శకుడు ప్రశాంత్‌వర్మ చెప్పారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులంతా మాట్లాడారు. అమృత అయ్యర్, వరలక్ష్మి శరత్‌కుమార్, వినయ్‌రాయ్, సత్య, గెటప్ శ్రీను, రాజ్ దీపక్ శెట్టి ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: దాశరథి శివేంద్ర, సంగీతం: గౌరహరి, అనుదీప్ దేవ్, కృష్ణ సౌరభ్.


కాజల్ అగర్వాల్

ఇప్పటివరకూ ఒకెత్తు 'సత్యభామ' ఒకెత్తు

కథ నచ్చడంతో సినిమా ఒప్పుకోవడమేకాక, సరాసరి కుటుంబంతో సహా హైదరాబాద్ వచ్చి సెటిలైపోయి షూటింగ్‌లో పాల్గొంటున్నది కాజల్ అగర్వాల్. అదీ కాజల్ నిబద్ధత. ప్రస్తుతం ఆమె 'సత్యభామ' అనే సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. కుటుంబంతో సహా కాజల్ హైదరాబాద్‌లో సెటిలైంది ఈ సినిమా కోసమే. ఇందులోని తన పాత్ర గురించీ, సినిమా గురించీ మీడియాతో మాట్లాడింది కాజల్. 'ఇందులో నేను పోలీస్ అధికారిగా నటిస్తున్నాను. శశికిరణ్ డైరెక్ట్ చేసిన 'మేజర్' సినిమా అంటే నాకు చాలా ఇష్టం. ఆయన నా 'సత్యభామ'కు దర్శకుడు కాకపోయినా సమర్పకుడు కావడం, స్క్రీన్‌ప్లే అందించడం చాలా ఆనందంగా ఉంది. 'భగవంత్ కేసరి' షూటింగ్ టైమ్‌లో శశికిరణ్ నాకీ కథ చెప్పారు. విని ఆశ్చర్యానికి లోనయ్యాను. అద్భుతమైన కథ, అత్యద్భుతమైన పాత్ర. వదులుకోకూడదని ఫిక్స్ అయిపోయి కుటుంబసమేతంగా హైదరాబాద్ వచ్చేశాను. అప్పట్నుంచి ఇక్కడే ఉంటూ, ఓవైపు బాబుని చూసుకుంటూ, మరోవైపు షూటింగ్‌లో పాల్గొంటున్నాను. ఇందులో నా పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుంది. అందుకే మార్షల్ ఆర్ట్స్ కూడా నేర్చుకుంటున్నాను. ఈ పాత్ర పోషణ విషయంలో విజయశాంతిగారే నాకు ఇన్‌స్పిరేషన్. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని యాక్షన్ సీన్స్ చేస్తున్నా. ఇప్పటిదాకా నేను చేసిన పాత్రలన్నీ ఒకెత్తు. 'సత్యభామ' ఒక ఎత్తు. ఇప్పటికే 65శాతం షూటింగ్ పూర్తయింది.' అంటూ చెప్పుకొచ్చింది కాజల్ అగర్వాల్.

దూసుకెళ్తున్న కెరీర్ గ్రాఫ్..

ఎన్టీఆర్

తారక్ లైనప్ చూస్తే ఎవరైనా 'వావ్..' అనాల్సిందే. 'ఆర్ఆర్ఆర్' తర్వాత ఆయన కెరీర్ గ్రాఫ్ సమూలంగా మారిపోయిందని చెప్పకతప్పదు. దేశవ్యాప్తంగా తనకొచ్చిన గుర్తింపు కారణంగా, బాలీవుడ్ నిర్మాతలు సైతం తారక్ కోసం క్యూ కడుతున్నారు. ఓ రెండుమూడేళ్ల పాటు తారక్ డైరీ ఫుల్. ప్రస్తుతం ఆయన 'దేవర' చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాను రెండు భాగాలుగా దర్శకుడు కొరటాల తెరకెక్కిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో తొలిభాగం విడుదల కానుండగా, 2025 ప్రథమార్థంలో 'దేవర2' విడుదల చేయడానికి పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తున్నారు నిర్మాతలు సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ. ఇదిలావుంటే 2025 ప్రథమార్థంలోనే ఎన్టీయార్-ప్రశాంత్‌నీల్ సినిమా విడుదల కూడా ఉంటుందని సమాచారం. ఈ సినిమా కూడా ప్రశాంత్ నీల్ రెండు భాగాలుగా తెరకెక్కించనున్న విషయం తెలిసిందే. అలాగే, 2025 ద్వితీయార్థంలో ఆగస్ట్ 14న బాలీవుడ్ మూవీ 'వార్ 2'ను విడుదల చేయనున్నట్టు యాష్‌రాజ్ సంస్థ ప్రకటించింది. హృతిక్, తారక్ కలిసి నటించనున్న ఈ చిత్రానికి ఆయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించనున్న విషయం విదితమే. 2026 ప్రథమార్థంలో ప్రశాంత్‌నీల్ సినిమా రెండో భాగం విడుదల ఉంటుందట. ఇలా విరామం లేకుండా సినిమాలు చేస్తూ విడుదల తేదీలను కూడా దాదాపుగా ఖరారు చేసుకుంటూ దూసుకెళ్తున్నాడు తారక్. రానున్న ఈ పాన్ ఇండియా సినిమాలు తారక్‌ను ఏ స్థాయిలో నిలబెట్టనున్నాయో చూడాలి.

దూతలో థ్రిల్లింగ్ లేయర్లు చాలాఉంటాయ్

విక్రమ్ కె.కుమార్

'దూత' అంటే మెసెంజర్. ఓ సంఘటన ప్రజల వద్దకు చేరవేసే జర్నలిస్ట్ కూడా దూతే. ఇది ఒక జర్నలిస్ట్ నేపథ్యంలో జరిగే కథ' అని దర్శకుడు విక్రమ్ కె.కుమార్ అన్నారు. నాగచైతన్య హీరోగా ఆయన దర్శకత్వంలో రూపొందిన వెబ్‌సిరీస్ 'దూత'. డిసెంబర్ 1 నుంచి ఈ సిరీస్ ప్రసారం కానుంది. ఈ సందర్భంగా విక్రమ్ కె.కుమార్ బుధవారం విలేకరులతో ముచ్చటించారు. ' ఎప్పట్నుంచో నామదిలో మెదులుతున్న కథ ఇది. స్క్రీన్‌ప్లే రాసుకున్నప్పుడు మాత్రం వెబ్ సిరీస్‌ని దృష్టిలో పెట్టుకునే రాసుకున్నాను. ఇది రెండుగంటల్లో చెప్పే కథ కాదు. ఈ కథకు ఎనిమిది ఎపిసోడ్లని హోల్డ్ చేసేంత బలముంది. ఇదో సూపర్ నాచురల్ జానర్. ఈ జానర్‌కి ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్నారు. ఈ సిరీస్ 240 దేశాల్లో ప్రసారం కానుంది. ప్రపంచ నలుమూలలలో ఉన్న ప్రేక్షకులు ఈ సిరీస్ చూస్తారు. కొరియన్, ఫారిన్ షోలకు ఏ మాత్రం 'దూత' తీసిపోదు.' అని విక్రమ్ కె.కుమార్ నమ్మకం వ్యక్తం చేశారు. 'చైతూతో మూడోసారి పనిచేస్తున్నాను. మేం మంచి ఫ్రెండ్స్. 'మనం' టైమ్‌లో తనకు ఓ హారర్ కథ చెప్పాను. తనకు ఘోస్ట్ స్టోరీస్ అంటే భయం. వద్దన్నాడు. 'దూత' మాత్రం తనకు బాగా నచ్చింది. ఈ సూపర్‌నాచురల్ కథలో చాలా లేయర్లుంటాయ్. ప్రేక్షకులను అవి థ్రిల్లింగ్‌కి గురిచేస్తాయి. ఇందులో నాగచైతన్యది ఇన్విస్టిగేటివ్ జర్నలిస్ట్ పాత్ర.' అని తెలిపారు విక్రమ్. '13బి' చేశాక, అలాంటి తరహా సినిమాలే చేయమని చాలామంది అడిగారని, డైరెక్టర్‌గా హారర్ ముద్ర పడిపోతుందని ఆ తరహా కథలకు ఇన్నాళ్లు దూరంగా ఉన్నానని, ఇన్నాళ్లకు మళ్లీ నాకిష్టమైన జానర్‌లో సిరీస్ చేసినందుకు ఆనందంగా ఉందని, 'దూత2', 'దూత3' ఆలోచనలు కూడా ఉన్నాయని ఆయన అన్నారు. నాగచైతన్యతో పాటు పార్వతి తిరువోతు, ప్రియా భవాని శంకర్, ప్రాచీ దేశాయ్ అందరూ చక్కగా నటించారని, సాంకేతికంగా కూడా సినిమా వండర్ అనిపిస్తుందని విక్రమ్ నమ్మకం వెలిబుచ్చారు.

ఆ లోటు తీరిపోయింది

పూజా హెగ్డే

'నా కెరీర్‌లో బెస్ట్ కేరక్టర్ 'దేవా'లో చేస్తున్నాను. డైరెక్టర్ రోషన్‌కు థ్యాంక్స్. ఓ ఇరవైఏళ్ల తర్వాత నా గురించి మాట్లాడాల్సొస్తే ముందు 'దేవా'లోని పాత్ర గురించే మాట్లాడతారు' అంటున్నది అందాలరాశి పూజాహెగ్డే. షాహిద్ కపూర్ కథానాయకుడిగా నటిస్తున్న 'దేవా' చిత్రంలో కథానాయికగా నటిస్తున్న పూజా.. ఇందులోని తన పాత్ర గురించి మీడియాతో మాట్లాడింది. 'అభినయానికి ఆస్కారమున్న పాత్రలు చాలా చేశాను. కానీ ఒక నటిగా నా ఆకలి మాత్రం అవి తీర్చలేకపోయాయి. జీవితంలో ఓ అసంతృప్తి ఉండేది. ఆ లోటుని 'దేవా' భర్తీ చేసేసింది. ఇందులో మధ్యతరగతి యువతిగా నటిస్తున్నాను. నా పాత్రలో ఎన్నో సంఘర్షణలుంటాయి. కథలో కీలకమైన పాత్ర. ఓ విధంగా ఇది నా కథ. మంచి అవకాశం ఇచ్చిన రోషన్‌కీ, హీరో షాహిద్‌కీ థ్యాంక్స్..' అని చెప్పుకొచ్చింది పూజా హెగ్డే. రాయ్ కపూర్ ఫిలింస్, జీ స్టూడియోస్ కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది దసరాకి విడుదల కానుంది.

సమయం వచ్చేవరకూ అందరూ సామాన్యులే..

సుడిగాలి సుధీర్, డాలీషా

'నటునిగా నాలోని మరోకోణాన్ని చూపించే పాత్ర ఇది. ఇదో కొత్త ప్రయత్నం. మీకు నచ్చితే పదిమందికి చెప్పండి. గురువారం అందరూ ఓటు వేయండి. 1న అందరూ నా సినిమా చూడండి.' అని సుడిగాలి సుధీర్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'కాలింగ్ సహస్ర'. డాలీషా కథానాయిక. అరుణ్ విక్కిరాలా దర్శకుడు. విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు కాటూరి నిర్మాతలు. డిసెంబర్ 1న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో సుధీర్ మాట్లాడారు. అతిథులుగా విచ్చేసిన జేడీ చక్రవర్తి, దర్శకులు దశరథ్, బొమ్మరిల్లు భాస్కర్ సినిమా మంచి విజయం సాధించాలని శుభాకాంక్షలు అందించారు. 'సమయం వచ్చే వరకూ ప్రతి ఒక్కరూ సామాన్యులే అనే లైన్ ఆధారంగా చేసుకుని ఈ కథ రాసుకున్నాను. సాంకేతికంగా అద్భుతంగా ఉంటుందీ సినిమా. నిర్మాతలు పేషన్‌తో ఈ సినిమాను నిర్మించారు. ఇందులో కొత్త సుధీర్‌ని చూస్తారు.' అని దర్శకుడు అరుణ్ విక్కిరాలా అన్నారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు.

ఈ పాత్ర నాకో ఛాలెంజ్..

కార్తీక్ రాజు

'క్రైమ్ , సస్పెన్స్ థ్రిల్లర్స్ అన్నీ ఒకేలా ఉంటాయి. కానీ ఈ సినిమాలో ఎలాంటి క్లూస్ లేని ఓ కేసుని ఎలా పరిష్కరించారు అనేది కొత్తగా ఉంటుంది. ఇప్పటివరకూ ఇలాంటి థ్రిల్లర్‌ని చూసుండరు' అని హీరో కార్తీక్‌రాజు అన్నారు. ఆయన కథానాయకుడిగా సిమ్రాన్ చౌదరి, ఐరా కథానాయికలుగా మహేశ్‌రెడ్డి దర్శకత్వంలో సుభాష్ నూతలపాటి నిర్మించిన చిత్రం 'అధర్వ'. డిసెంబర్ 1న చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో కార్తీక్ రాజు విలేకరులతో ముచ్చటించారు. 'కథే ఈ చిత్రానికి బలం. ఇందులో నా పాత్ర కొత్తగా ఉంటుంది. పోలీస్ కావడం ఇందులో నా డ్రీమ్. కానీ ఆస్తమా కారణంగా కాలేకపోతాను. అందుకే క్లూస్ టీమ్‌లో జాయిన్ అవుతాను. ఓ విధంగా ఛాలెంజింగ్ రోల్ అనమాట.' అని కార్తీక్ చెప్పారు. హీరోయిన్స్ పాత్రలకు కూడా కథలో ప్రాధాన్యత ఉంటుందని, ఈ సినిమాను క్లూస్ టీమ్‌కు ప్రత్యేకంగా ప్రదర్శిస్తే, సినిమా చూసి వారెంతో అభినందించారని ఆయన తెలిపారు. డిసెంబర్ 7 నుంచి తన కొత్త సినిమా మొదలుకానున్నదని, అలాగే పీపుల్ మీడియా ఫ్యాక్టరీలో ఓ సినిమా ఇప్పటికే పూర్తి చేశానని కార్తీక్ రాజు చెప్పారు.